లోలెవల్ వంతెన.. హైలెవల్ కష్టాలు

- చిన్నపాటి వర్షానికి రాకపోకలు బంద్
- వాహనదారులకు తీవ్ర ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు



రాజుపాళెం-వెంగళాయపల్లె గ్రామాల మధ్యలో ఉన్న లోలెవెల్ వంతెనపై పారుతున్న వరదనీరు (ఫైల్)

రాజుపాళెం : చిన్నపాటి వర్షానికి వంతెనపై నీరు చేరడంతో ఆదారిలో పూర్తిగా రాకపోకలు బంద్ అవుతున్నాయి. దీంతో చేసేదేమీలేక చుట్టూ 15 కిలోమీటర్లు తిరిగి రావాల్సిన పరిస్థితి. ప్రొద్దుటూరు-ఆళ్లగడ్డ ప్రధాన రహదారిలో రాజుపాళెం-వెంగళాయపల్లె గ్రామాల మధ్యలో మడువంక వద్ద ఉన్న వంతెనపై హైలెవెల్ వంతెనను నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు. అలాగే వంతెనకు ఇరువైపులా డివైడర్లు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురౌతున్నారు. పైతట్టు ప్రాంతాలైన పెద్దముడియం, జమ్ములమడుగు, పెద్దపసుపల, పర్లపాడు, అర్కటవేముల తదితర గ్రామాల్లోని వర్షం నీరు, పొలాల్లోని నీరంతా ఇక్కడకు వస్తుంది. దీంతో ఒక్కసారిగా నీరంతా రావడంతో రహదారి పైకి పారుతూ పోవడంతో వంతెనపై రాకపోకలకు పూర్తిగా అంతరాయం కలుగుతోంది. మండలంలోని వెంగళాయపల్లె, పగిడాల, వెల్లాల, కుమ్మరపల్లె, గోపాయపల్లె, పర్లపాడు, అర్కటవేముల, సోమాపురం, గాదెగూడూరు, కూలూరు, కొట్టాల గ్రామాల ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వారు చుట్టూ 18 కిలోమీటర్లు తిరిగి గ్రామాలకు చేరుకుంటున్నారు. అంతేకాకుండా ప్రొద్దుటూరు నుంచి ఆళ్లగడ్డకు ప్రధాన రహదారి కావడంతో ప్రతినిత్యం వందలాది వాహనాలు పోతుంటాయి. వర్షాకాలంలో అయితే ఈవంతెనపై రాకపోకలకు పూర్తిగా అంతరాయం కలుగుతోంది. ఇక్కడ హైలెవెల్ వంతెన నిర్మాణం చేపట్టాలని ఎన్నో సార్లు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు తెలిపినా పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు వాపోతున్నారు. వెల్లాల సమీపంలో కుందూనదిపై హైలెవెల్ వంతెన నిర్మించడంతో అక్కడ వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా ఉంది. మడువంక వద్ద అంతరాయం కలుగడంతో ఆ వంతెన నిర్మించినా ఉపయోగం లేకుండా పోయిందని వాహనదారులు అంటున్నారు.

ఫోర్ వే వస్తే...

వేంపల్లి నుంచి ప్రొద్దుటూరు మీదుగా రాజుపాళెం, చాగలమర్రి వరకు ఫోర్ వే రహదారి వేయాలని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో అధికారులు అంచనాలు తయారు చేశారు. దీనిపై గతేడాది సంబంధిత నేషనల్ హైవే అధికారులు, రెవెన్యూ అధికారులు కలిసి ఫోర్ వేకు సంబంధించిన భూములు పోతుండటంతో సమావేశం కూడా ఏర్పాటు చేశారు. అయితే ఇప్పటికీ స్పష్టమైన సమాచారం రాకపోవడంతో అటు వాహనదారులు, ఇటు రైతులు ఆందోళన చెందుతున్నారు.

పట్టించుకోని అధికారులు

ఈలోలెవెల్ వంతెనపై చిన్నపాటి వర్షానికే నీరు పారుతున్నా, రాకపోకలు బంద్ అయినా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత నేషనల్ హైవే అధికారులు, పాలకులు స్పందించి హైలెవెల్ వంతెనను నిర్మించాలని వారు కోరుతున్నారు.

వంతెన వివరాలు

- నిర్మించింది ఎప్పుడు : 1977
- సమస్య : వరదనీరు వచ్చినప్పుడు రాకపోకలకు అంతరాయం
- ఎన్ని గ్రామాలకు ఇబ్బందులు : 11 గ్రామాలు
- ఏ గ్రామాలు : మండలంలోని వెంగళాయపల్లె, పగిడాల, వెల్లాల, కుమ్మరపల్లె, గోపాయపల్లె, పర్లపాడు, అర్కటవేముల, సోమాపురం, గాదెగూడూరు, కూలూరు, కొట్టాల
- ఇబ్బంది : చుట్టూ 18 కిలోమీటర్లు తిరిగి పోవాల్సి వస్తోంది

రాకపోకలు బంద్



మడువంక వద్ద ఉన్న వంతెనపై చిన్నపాటి వర్షానికి రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో చేసేదేమీలేక వాహనాలన్నీ అలాగే ఉండిపోవాల్సి వస్తుంది. చాగలమర్రి, ఆళ్లగడ్డ గ్రామాలకు వెళ్లాలంటే ప్రత్యామ్నాయంగా 18 కిలోమీటర్లు చుట్టూ తిరిగి పోవాల్సి వస్తోంది.

– బాల సుబ్బరాయుడు, వెంగళాయపల్లె గ్రామం, రాజుపాళెం మండలం

హైలెవెల్ వంతెన నిర్మించాలి



మడువంక వద్ద కొత్తగా హైలెవెల్ వంతెన నిర్మించాలి. ఈవంతెన వద్ద వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికే రాకపోకలకు పూర్తిగా అంతరాయం కలుగుతోంది. దీంతో పాఠశాలలకు, కళాశాలలకు, పట్టణాలకు వెళ్లే వారంతా ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలి.

– అంకాల్, రాజుపాళెం

క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



పోరుమామిళ్ల ఎస్ఐ కొండారెడ్డి



చాపాడు ఎస్ఐ కె.చిన్నపెద్దయ్య



కలసపాడు ఎస్ఐ చిరంజీవి

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల ఎస్ఐగా ఆర్‌వీ కొండారెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో పని చేసి సాధారణ బదిలీల్లో భాగంగా పోరుమామిళ్లకు వచ్చారు.

చాపాడు : మండల పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా కె.చిన్నపెద్దయ్య బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఆర్‌వీ కొండారెడ్డి పోరుమామిళ్లకు బదిలీ కాగా, అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె ఎస్ఐగా పని చేస్తున్న కె.చిన్నపెద్దయ్య ఇక్కడికి వచ్చారు.

కలసపాడు : మండల ఎస్ఐగా చిరంజీవి బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రొద్దుటూరు రూరల్ పోలీసుస్టేషన్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ఎంపీడీఓగా రామక్రిష్ణయ్య



గోపవరం : మండల అభివృద్ధి అధికారిగా రామక్రిష్ణయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ఇక్కడ ఎంపీడీఓగా పని చేస్తూ డిప్యుటేషన్‌పై కడపకు వెళ్లారు. ప్రభుత్వం డిప్యుటేషన్‌ను రద్దు చేసి గతంలో పని చేస్తున్న చోటికే వెళ్లాలని ఆదేశాలు జారీ చేయడంతో మళ్లీ బాధ్యతలు స్వీకరించారు.

న్యాయవిజ్ఞాన సదస్సు

బి.కోడూరు : మండలంలోని కాసానగరం వద్ద గల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బద్వేలు జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రి ఆధ్వర్యంలో సోమవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కోర్టు సూచనల మేరకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ బద్వేలు వారి ఆధ్వర్యంలో ఈ సదస్సునిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందుగా పాఠశాలను తనిఖీ చేయడంతోపాటు విద్య, మౌలిక వసతులపై ప్రిన్సిపల్‌తో మాట్లాడి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీలత, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం

ప్రొద్దుటూరు క్రైం : విద్యార్థులకు హెచ్‌ఐవీపై అవగాహన అవసరమని కరస్పాండెంట్ శ్రీకాంత్ తెలిపారు. హెచ్‌ఐవీ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు చైతన్య ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై 'మీకు తెలుసా' అనే కార్యక్రమాన్ని సోమవారం శ్రీ విద్య జూనియర్ కాలేజీలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ రమణారావు హెచ్‌ఐవీ గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రాజెక్టు మేనేజర్ నరేష్‌కుమార్, సిబ్బంది పుల్లయ్య, ప్రతిమా, భాగ్య, ఉమామహేశ్వరి, సునీత, వంశీ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

బి.కోడూరు : మండలంలోని కాసానగరం వద్ద గల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు సోమవారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆప్తాలిక్ ఆఫీసర్ హుస్సేనయ్య, ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి, సూపర్‌వైజర్ జాన్‌విలియం, సీహెచ్‌ఓ ప్రియదర్శిని, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, ఏఎన్‌ఎం లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

రాజుపాళెం : గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని నియోజకవర్గ అభివృద్ధి వేదిక కన్వీనర్ నాగరాజు పేర్కొన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్మికులకు ఏడాదికిపైగా జీతాలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు జీతాలు విడుదల చేయాలని కోరారు. అనంతరం రాజుపాళెం ఇన్‌చార్జి ఎంపీడీఓ షాకీర్ ఆలీఖాన్‌కు వినతి పత్రం అందించారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

మైదుకూరు : ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో లాభాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయ విభాగం డివిజన్ ఇన్‌చార్జి, మాస్టర్ ట్రైనర్ సి.కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నంద్యాలంపేట క్లస్టర్‌లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న పలు పంటల పొలాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్పీ సీహెచ్ బాలయ్య పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

చాపాడు : ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఇ.మ్యాగీ తెలిపారు. ఇందుకోసం తమ గ్రామ సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో వీఏఏలను సంప్రదించాలని పేర్కొన్నారు. సెప్టెంబర్ 15వ తేదీలోగా ఆధార్ కార్డు, 1-బి, బ్యాంక్ ఖాతా, ఫోను నంబర్‌ను అందజేయాలన్నారు. కౌలు రైతులు పంట సాగు చేస్తే ప్రభుత్వం మంజూరు చేసిన ధ్రువీకరణ పత్రం జిరాక్స్ ఇవ్వాలన్నారు.

చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు ఆపాలి



బద్వేలు తహసీల్దారుకు వినతిపత్రం సమర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

బద్వేలు అర్బన్ : గత ప్రభుత్వ హయాంలో నియమితులయ్యారన్న కారణంతో స్కీం వర్కర్లు, చిరుద్యోగులపై రాజకీయ నాయకులు చేస్తున్న వేధింపులు ఆపాలని ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి నాగేష్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజుకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ అనుయాయులను నియమించుకోవాలన్న ఉద్దేశంతో రోజూవారి వేతనం మీద ఆధారపడి జీవిస్తున్న చిరుద్యోగులపై అధికార పార్టీ నాయకులు బెదిరింపులకు పాల్పడటం తగదన్నారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేకున్నా అరకొర వేతనంతో జీవించే చిరుద్యోగులను తొలగించాలనుకోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా చిరుద్యోగులపై వేధింపులు మానుకోవాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్త ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు జయలక్షుమ్మ, సునీత, ఏఐటీయూసీ నాయకులు ఓబయ్య, ఆనంద్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

బెదిరించడం మంచిది కాదు

పోరుమామిళ్ల : వివిధ ప్రభుత్వ పథకాల్లో (అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, ఆశ తదితర) పని చేస్తున్న చిరు ఉద్యోగులను పని మానుకోవాలని, లేకపోతే తొలగిస్తామని బెదిరించడం మంచిది కాదని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం డిప్యూటీ తహసీల్దారు సంజీవరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినప్పుడల్లా చిరు ఉద్యోగులపై కొరడా ఝుళిపించడం మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. పార్టీలకు అధికారం శాశ్వతం కాదని, ప్రజలకు సేవలు అందించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం మాత్రం శాశ్వతమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రవి, ఏఐటీయూసీ మండల నాయకులు సఫా, కేశవ, మహమ్మద్ రఫీ, చాంద్‌బాషా, రేణుకమ్మ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎస్‌ఎంసీ చైర్మన్లకు సన్మానం



సన్మాన కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఎస్‌ఎంసీ చైర్మన్లు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఇస్లాంపుర వీధిలోని మున్సిపల్ మాజీ ఇన్‌చార్జి చైర్మన్ వీఎస్ ముక్తియార్ కార్యాలయంలో సోమవారం మనప్రజా సేవా సమితి ఆధ్వర్యంలో ఎస్‌ఎంసీ చైర్మన్లను సన్మానించారు. కొత్తకొట్టాల ఉర్దూ మున్సిపల్ హైస్కూల్ ఎస్‌ఎంసీ చైర్మన్ షేక్ అబ్దుల్‌సత్తార్, మోడంపల్లె ఉర్దూ మున్సిపల్ హైస్కూల్ చైర్మన్ ఎస్‌ఎం లాల్‌బాషా, ఎస్‌వీవీ హైస్కూల్ ఎస్‌ఎంసీ చైర్మన్ షేక్ ఆలీబాషా, వెలవలి జెడ్పీ హైస్కూల్ ఎస్‌ఎంసీ చైర్మన్ షేక్ జాకీర్ హుస్సేన్, వెలవలి ఉర్దూ అప్పర్‌ప్రైమరీ స్కూల్ ఎస్‌ఎంసీ చైర్మన్ కె.చిన్నమౌలాలి, ప్రకాష్‌నగర్ అప్పర్ ప్రైమరీ స్కూల్ ఎస్‌ఎంసీ చైర్మన్ ఓబులేసులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. వీరు పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని ముక్తియార్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం సురేష్‌నాయుడు తెలిపారు. కార్యక్రమంలో మన ప్రజాసేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, ఉపాధ్యక్షుడు బీటెక్ బాషా, కౌన్సిలర్ మునీర్, టౌన్ బ్యాంకు డైరెక్టర్ ఖలీల్, మహేష్, యూసఫ్, ఫరాన్, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

పని సర్దుబాటును బహిష్కరించాలి



కలసపాడు : ఎంఈఓలకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : పని సర్దుబాటు ప్రక్రియ చాలా అసంబద్ధంగా ఉందని, దీనిని ఉపాధ్యాయులు బహిష్కరించాలని ఫ్యాప్టో నాయకులు తెలిపారు. ఈ విషయమై వారు ఇన్‌చార్జి ఎంఈఓ శివప్రసాద్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డీవీ రవీంద్రుడు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటుపై ఉపాధ్యాయ సంఘాలు సూచించిన ఏ అంశాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని విమర్శించారు. విద్యాశాఖ అధికారులు సర్దుబాటు ప్రక్రియను ఉన్నఫలంగా చేపట్టడం దారుణమన్నారు. యుటీఎఫ్ నాయకుడు నాగరాజు, ఎస్టీయూ నాయకుడు సుబ్రహ్మణ్యం, నాగేశ్వరరెడ్డి, ఎంటీఎఫ్ రఫివుద్దీన్, ఏపీటీఎఫ్ నాయకుడు సయ్యద్‌బాష పాల్గొన్నారు.

- ఉపాధ్యాయుల పని సర్దుబాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఫోర్టో ప్రధాన కార్యదర్శి అంకాల్ కొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

కలసపాడు : కలసపాడులోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఫ్యాప్టో నాయకులు నిరసన చేపట్టి ఎంఈఓలు ప్రేమ్‌సాగర్, ఎస్.మస్తాన్‌వలిలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో రాష్ట్ర నాయకుడు పి.రమణారెడ్డి, సి.వెంకటరెడ్డి, కె.క్రిష్ణారెడ్డి, బి.ఎస్.వి.ప్రసాద్, శేఖర్‌బాబు, బాలజోజి, ఎస్.వి.సత్యనారాయణ, కె.శ్రీనివాసులు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : విద్యా వ్యవస్థకు ఇబ్బందికరంగా ఉన్న జీఓ 117ను రద్దు చేయాలని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. ఎస్టీయూ, ఏపీటీఎఫ్, యూటీఎఫ్‌కు చెందిన ఫ్యాప్టో నాయకులు ఎంఈఓ బాల అంకిరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఏపీటీఎఫ్ స్టేట్ కౌన్సిలర్ సురేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సత్తార్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదోన్నతులు ఇచ్చి ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తే ప్రాథమిక పాఠశాలలు బలోపేతమవుతాయన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ



రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైవీఎస్ మున్సిపల్ బాలికల హైస్కూల్ ఆవరణలోని జవహర్ బాలకేంద్రంలో శిక్షణ పొందుతున్న తైక్వాండో క్రీడాకారులు రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనపరిచి 8 బంగారు, 6 రజతం, 4 కాంస్య పతకాలు సాధించారు. తిరుపతి శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శని, ఆదివారాల్లో ఏపీ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో 9వ ఇంటర్ స్టేట్ ఇన్విటేషనల్ ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. సబ్‌జూనియర్ బాలికల విభాగంలో నందిని, జాహ్నవి, సంజన సిల్వర్ మెడల్స్, సబ్ జూనియర్ బాలుర విభాగంలో ఉస్మాన్, ఇర్ఫాన్, అభిరాం, యువరామ్, దీక్షిత్, కార్తవ్యార్జున్ బంగారు పతకం, గౌరీశ్వర్, దక్షేష్, శ్రావణ్‌లు సిల్వర్ మెడల్స్, సంజీవ్, జోగీశ్వర్, సాత్విక యాదవ్, హేమంత్ బ్రాంజ్ మెడల్స్ పొందగా, సీనియర్ విభాగంలో శివనాథ్, హేమశ్రీ గోల్డ్ మెడల్స్ సాధించారు. ప్రతిభ కనపరచి పతకాలు సాధించిన విద్యార్థులను మాస్టర్ మునీశ్వర్, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

16న ఇంటర్వ్యూలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక తపాలా శాఖ ప్రధాన కార్యాలయంలో ఈ నెల 16న తపాలా జీవిత బీమాలో డైరెక్టుగా ఏజెంట్లుగా చేరేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తపాలా సూపరింటెండెంట్ జి.కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. 10 తరగతి అర్హతతో 18 నుంచి 50 ఏళ్ల నిరుద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, స్వయం ఉపాధి కోరే వారు, ఇతరులు ఈ ఇంటర్వ్యూలో పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు తపాలా జీవిత బీమా డెవలప్‌మెంట్ ఆఫీసర్ సత్యనారాయణ సెల్ నంబర్ 8498977463కు సంప్రదించాలని కోరారు.

సమాజసేవకు పాటుపడాలి



యువజనోత్సవ సభలో యువతకు సన్మానం

పోరుమామిళ్ల : సమాజ సేవ చేసేందుకు యువత నడుంబిగించాలని విశ్రాంత జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మార్కారెడ్డి తెలిపారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. యువత చెడు వ్యసనాలు, మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉన్నత లక్ష్యాలపై దృష్టి సారించాలన్నారు. వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రామకృష్ణారెడ్డి చిన్న వయసులో సేవామార్గంలో పయనిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. అనంతరం సామాజిక సేవ చేస్తున్న యువకులను రామకృష్ణారెడ్డి సత్కరించి, 'మేలుకో నేస్తమా' అనే పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుమూర్తి, యువనేత గిరిప్రణీత్‌రెడ్డి, రోడ్డు సేఫ్టీ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ శివశంకర్, అధ్యాపకులు సులోచన, ఈశ్వరయ్య, నరసింహారెడ్డి, వెంకటరావు, హరిబాబు, సంస్థ ప్రతినిధులు రోశిరెడ్డి, పీరారెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

నాణ్యమైన ఉత్పాదకాలు విక్రయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ నాగరాజ

అట్లూరు : నాణ్యమైన ఉత్పాదకాలను రైతులకు విక్రయించాలని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకుడు డాక్టర్ ఎం.నాగరాజ పేర్కొన్నారు. సోమవారం వ్యవసాయ డివిజన్ కార్యాలయంలో ఎరువులు, విత్తనాలు, పురుగు నివారణ మందుల డీలర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. లైసెన్సు గడువు, స్టాకు రిజిస్టర్ నిల్వలు, గోడౌన్స్ నిల్వలు, రసీదు బుక్స్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్టబద్ధ వ్యాపారం చేయాలని, ధరల, స్టాకు బోర్డు పట్టికలో వివరాలు రాయాలని, రైతులు కొన్న మొత్తానికి రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. అలాగే నాణ్యమైన ఉత్పత్తులు మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. గడువు తీరిన ఉత్పాదకాలను విక్రయించరాదన్నారు. బద్వేలులోని నాణ్యత పరీక్ష కేంద్రానికి విత్తన, ఎరువుల నమూనాలు సమర్పించాలన్నారు. అనంతరం ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు ప్రచురించిన 2024-25 వ్యవసాయ పంచాంగం నిర్దేశిత రుసుం రూ.270 చొప్పున డీలర్లకు విక్రయించారు. సమావేశంలో బద్వేలు, గోపవరం మండలాల వ్యవసాయాధికారులు చంద్రమోహన్‌రెడ్డి, రామకృష్ణయ్య, ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్ వ్యవసాయాధికారిణి బి.మాధురి, కార్యాలయ సిబ్బంది గైబువల్లి, చంద్రకళ, డీలర్లు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధికి సమష్టి కృషి



ప్రొద్దుటూరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు : గ్రామ పంచాయతీల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. సమావేశంలో డీఎల్‌పీఓ విజయభాస్కర్, ఎంపీడీఓ కుళ్లాయమ్మ, ఈఓపీఆర్డీ రామాంజనేయరెడ్డి, ట్రైనర్లు నరసింహులు, హరినాథ్ పాల్గొన్నారు.

రాజుపాళెం : స్థానిక మండల పరిషత్ సభాభవనంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ షాకీర్ ఆలీఖాన్ మాట్లాడుతూ పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని, మంచినీరు అందించాలని సూచించారు.

చాపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. రీసోర్స్ పర్సన్‌లు ధనేశ్వర్‌బాబు, సుధాకర్, శ్రీనివాసులు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి శ్రీధర్‌నాయుడు, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : కార్యదర్శులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖర్, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సీఎం బాషా పేర్కొన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఎంపీడీఓ వరప్రసాదరావు, ఈఓపీఆర్డీ రాజీవ్‌రెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఖాజీపేట : ఎంపీడీఓ సభా భవనంలో మండలంలోని పంచాయతీ సెక్రటరీలు, సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకటరమణ, ఈఓపీఆర్డీ వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన : నరసాపురంలోని స్త్రీశక్తి భవనంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ముజఫర్‌రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

కాలిబాటలతో అధిక దిగుబడి



నారు కొనలు తుంచి నాటాలని సూచనలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

కాశినాయన : రైతులు వరి పంటలో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవడం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో వరి నాటు పొలాలను ఆయన పరిశీలించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్లు వెడల్పు గల కాలిబాటలను ఏర్పాటు చేసుకోవడం వల్ల పంటకు సూర్యరశ్మి సోకి సుడిదోమ వంటి కీటకాల నుంచి రక్షించుకోవచ్చన్నారు. అలాగే వరి నాటే ముందు నారు కొనలను తుంచి నాటుకోవాలన్నారు. దీనివల్ల మొక్కల ఎదుగుదల పెరుగుతుందన్నారు. సీజనల్ రోగాలు, కీటకాల నుంచి రక్షించుకోవచ్చన్నారు. దీని ద్వారా ఫంగస్ వ్యాపించకుండా ఉంటుందని తెలిపారు. రైతులు వరిపంటలో ఈ మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు పొందడంతోపాటు చీడపీడల నుంచి సంరక్షించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

చైతన్య జ్యోతి సొసైటీపై చర్యలకు డిమాండ్

ప్రొద్దుటూరు : ప్రభుత్వ ఆస్పత్రుల శానిటేషన్ నిర్వహణకు తీసుకున్న చైతన్య జ్యోతి సొసైటీపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బారాయుడు డిమాండ్ చేశారు. ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రమీలమ్మ, రాజమ్మలతో కలిసి తహసీల్దారు గంగయ్యకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న 55 మంది శానిటేషన్ సిబ్బందికి నాలుగు నెలల వేతనాలు, వేంపల్లెలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందికి ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదన్నారు. కార్మికుల సొమ్ముతో సొసైటీ వారు వడ్డీ వ్యాపారం చేసుకుంటున్నారని ఆరోపించారు. తమ సమస్యలను పరిష్కరించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌లకు సమ్మె నోటీసు ఇచ్చామన్నారు. శానిటేషన్ సిబ్బంది పీఎఫ్, ఈఎస్ఐ, పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు చెన్నమ్మ, విమల, సరోజమ్మ, నీరజ, ఎస్తేరు రాణి పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు వెంకటసుబ్బయ్య, సుబ్బరాయుడు మాట్లాడుతూ స్వాతంత్య్ర ఉద్యమంలో విద్యార్థుల తరపున ఏఐఎస్ఎఫ్ కీలక పాత్ర పోషించిందన్నారు. యూనివర్సిటీల్లో జరుగుతున్న అక్రమాలను వెలికి తీసేందుకు, నాణ్యమైన విద్యను అందించేందుకు విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి పీటర్, టోని, అఖిల్, తౌసిఫ్, మౌనిష్, నాని తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయ భూమి వేలం

చాపాడు : అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి దేవస్థానానికి చెందిన 1.50 ఎకరాల భూమి కౌలుకు ఇచ్చేందుకు సోమవారం వేలం నిర్వహించారు. దేవదాయ శాఖ ప్రొద్దుటూరు ఇన్‌స్పెక్టర్ నరసింహసింగ్ సమక్షంలో సర్వే నంబరు 123-1లో గల 1.50 ఎకరాల భూమికి వేలం నిర్వహించారు. కేతవరం గ్రామానికి చెందిన నరసింహారెడ్డి రూ.11,500లకు మూడేళ్లపాటు వ్యవసాయం చేసుకునేందుకు భూమిని దక్కించుకున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు.